క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



పట్నంబజారు: నగరంలోని కొత్తపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ ఈనెల 4న మృతి చెందిన కానిస్టేబుల్ ఎం.కిశోర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈస్ట్ సబ్ డివిజన్‌కు సంబంధించి కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు సిబ్బంది, అధికారులు ముందుకు వచ్చి అందజేసిన రూ. 2,05,616ల చెక్కును ఏఎస్పీ నిచికేష్ షలేఖే లాలాపేటలోని ఆయన కార్యాలయంలో కానిస్టేబుల్ కిశోర్ భార్య సుధారాణికి అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట, పాత గుంటూరు సీఐలు షేక్ అన్వర్ బాషా, సుబ్బారావు పాల్గొన్నారు.

28న హాస్టల్‌లో కేర్ టేకర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల అనుబంధ ఉన్న హాస్టల్‌లో రెండు కేర్ టేకర్ పోస్టులకు ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన అవివాహితులైన యువతులు శనివారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు. ఎంపికైన వారికి భోజన, వసతి సదుపాయాన్ని వర్తింప చేస్తామని తెలియజేశారు.

నేడు లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు వారి తోట 7వ లైనులోని కేర్ వెల్ హాస్పిటల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగూర్ బాషా తెలిపారు. రోగులకు రూ. 10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు 8341713713, 9854757999 నంబర్లలో సంప్రదించాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా తెలిపారు.

మోపిదేవి పోలీసుల తీరు బాధాకరం

నెహ్రూనగర్: దొంగతనం నెపంతో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మహిళల్ని కొట్టిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో కృష్ణాజిల్లా మోపిదేవి పోలీసులు కూడా బాధితుల్ని కొట్టడం బాధాకరమని తెలిపారు. నిందితుల్ని కఠినంగా శిక్షించడంతోపాటు, పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

సెస్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి



కాకుమాను: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే నెల మూడో తేదీ నుంచి సెస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంటు సర్వే)పరీక్షల్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఈఓ-1 కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో పరీక్షలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సెస్ పరీక్షల్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు కూడా పరీక్షలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంఈవో 2-విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

బీపీఎల్-23 విజేత బాప్టిస్ట్ రాయల్ జట్టు



మంగళగిరి: నగరంలోని బాప్టిస్ట్‌పేటలో జరిగిన బీపీఎల్ – 23 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని బాప్టిస్ట్ రాయల్ జట్టు కైవసం చేసుకుంది. గత కొద్ది రోజులుగా జరిగిన మ్యాచ్‌లలో ఫైనల్‌కు చేరిన బాప్టిస్ట్ వారియర్స్ జట్టు, బాప్టిస్ట్ రాయల్ జట్లు బుధవారం జరిగిన మ్యాచ్‌లో హోరా హోరీగా తలబడ్డాయి. టాస్ గెలిచిన రాయల్స్ జట్టు ఫీల్డింగ్ చేపట్టగా బ్యాటింగ్ చేపట్టిన వారియర్స్ జట్టు నాలుగు వికెట్లు నష్టానికి 87 పరుగులు సాధించింది. 88 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్స్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 88 పరుగులతో విజయం సాధించింది. టోర్నమెంట్ నిర్వాహకులు విజేతలకు మెమెంటోలను బహూకరించి, టోర్నమెంట్‌లో పాల్గొన్న ఆరు జట్లుకు ప్రశంసాపత్రాల్ని అందజేశారు.

నీడపట్టు ఉద్యోగాలతో ఎముకలు గుల్ల

గుంటూరు బ్రాడీపేటకు చెందిన రాజేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా నిత్యం ఏసీ గదుల్లో కూర్చుంటాడు. ఇటీవల బంధువుల వివాహ పనులపై ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. మూడు పదుల వయస్సు కూడా దాటకుండానే, కొద్దిపాటి ప్రమాదానికే కాలి ఎముక విరిగిపోవడంతో వైద్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తీరా పరీక్షలు చేసి.. ఏ మాత్రం ఎండ తగలకుండా ఏసీ గదుల్లో ఉంటూ ఆధునిక జీవనశైలి వల్ల ఆస్టియోపొరోసిస్‌కు గురైనట్లు నిర్ధారించారు. నేడు యువత చిన్నవయస్సులోనే ఈ వ్యాధి బారిన పడుతున్నారని ఆర్థోపెడిక్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – గుంటూరు మెడికల్

- యువకుల్లో పెరుగుతున్న ఆస్టియోపొరోసిస్
- పటుత్వం కోల్పోతున్న ఎముకలు
- ఎండ తగలకపోవడం లోపం


చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవడం ఆస్టియోపొరోసిస్ వ్యాధి(బోలు ఎముకలు) సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. ఆధునిక జీవన శైలి వల్ల ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడిపేవారు దీని బారిన పడుతున్నారు. నేడు కళాశాల, పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో చాలా మంది ఎండ ఏ మాత్రం తగలకుండా ఏసీ గదుల్లో ఉంటున్నారు. ఆటలు ఆడేందుకు కూడా ఎండలోకి ఏ మాత్రం వెళ్లకపోవడంతో ఏదైనా దెబ్బతగిలిన సమయంలో ఊరికే ఎముకలు విరిగిపోతున్నాయి.

వ్యాధి లక్షణాలు

వయస్సు పైబడిన వారిలో నడుంనొప్పి, వెన్నెముక ఎదుగలలోపించి ఎత్తు ఆగిపోవడం, వళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేకపోవడం, నీరసం, నిస్సత్తువ, నిరాశ, ఓపిక లేకపోవడం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఎండ నుంచి శరీరానికి డీ విటమిన్ లభించకపోవడం సమస్యకు ఒక కారణం. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే వెన్నుపూస, చేతి మణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్న దెబ్బ తగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి. రక్త పరీక్షలు, ఎక్సరే, ఎముకల సాంద్రత పరీక్షల ద్వారా వ్యాధి సోకిందా లేదా ? అనే విషయాలు తెలుస్తాయి.

సోకడానికి కారణాలు

- కుటుంబంలో ఎవరికైనా ఉంటే వారసత్వంగా వచ్చే అవకాశం
- సరైన పోషకాహారం తీసుకోకపోవడం
- మద్య, ధూమపానం లాంటి చెడు అలవాట్లు
- థైరాయిడ్, లివర్ వ్యాధులు, కొన్ని రకాల మందులు వాడటం
- రోజంతా ఏమాత్రం ఎండలో రాకుండా ఏసీలోనే గంటల తరబడి గడపటం
- శారీరక వ్యాయామం లేకపోవడం
- ప్రతిరోజూ కనీసం అరగంట కూడా నడవకపోవడం



అస్టియోపొరోసిస్ పోస్టర్

బాధితులు అధికమే...

సాధారణంగా ఆడవాళ్లలో మోనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్లలో, మగవాళ్లలో 50 ఏళ్ల వయస్సులో ఆస్టియోపొరోసిస్ వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వయోవృద్ధుల్లో 33 శాతం మంది తుంటి ఫ్రాక్చర్ సమస్యలతో బాధపడుతుండగా వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు దీనితోనే మరణిస్తున్నారు. మన దేశంలో 6.1 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఆడవారిలో 50 ఏళ్లు దాటిన ప్రతి ముగ్గురిలో ఒకరు , మగవారిలో 12 మందిలో ఒకరు బారిన పడుతున్నారు. గుంటూరు జిల్లాలో 150 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి రోజూ 50 మందికి పైగా వివిధ రకాల ఎము కల సమస్యలతో వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. వీరిలో సగం ఆస్టియోపొరోసిస్ బాధితులే ఉంటడం గమనార్హం.

ముందస్తు వైద్య పరీక్షలతో వ్యాధి నుంచి రక్షణ



కీళ్ల వాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వీరికి ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. చిన్న వయస్సు నుంచే ఎముకలు బలంగా ఉండేలా పౌష్టికాహారం తీసుకోవాలి. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న దృష్ట్యా యుక్త వయస్సు నుంచి తప్పనిసరిగా ఎముకలు బలంగా తయారయ్యేలా డైట్ తీసుకోవాలి.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు.

అరగంట నడక తప్పనిసరి



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా పెంచుకోవచ్చు. విటమిన్ డీ కోసం ప్రతిరోజూ కొంత సేపు ఎండలో ఉండాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్ డీ, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగ, మద్యం తాగడం లాంటి చెడు అలవాట్లు విడనాడాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా అరగంట సేపైనా నడవాలి.

– డాక్టర్ జె.నరేష్‌బాబు, స్పైన్ సర్జన్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఆస్టియోపొరోసిస్ బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం. సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ విభాగాల్లో ప్రతిరోజూ 150 మంది వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 మంది ఆస్టియోపొరోసిస్ బాధితులే. యువకులు కూడా దీని బారిన పడడం ఆందోళకరమైన అంశం. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బయటపడవచ్చు.

– డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్

కళలతో మనిషికి అలౌకిక ఆనందం



లక్ష్మీపురం: కళలు మనిషికి అలౌకిక అందాన్ని అందిస్తాయని సంగీత విద్వాంసుడు పి.మొగిలి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ కళలు గతానికి వర్తమానానికి వారధివంటివని, వాటిని పరిరక్షించాలని కోరారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణ మాట్లాడుతూ వ్యక్తి సృజనాత్మకశక్తి కలిగి ఉంటే అది బహుముఖాలుగా విస్తరిస్తుందన్నారు. దీనికి ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు పికాసో ఉదాహరణగా పేర్కొన్నారు. ఆయన కవిగా, నాటక రచయితగా కూడా పేరొందారని గుర్తు చేశారు. ఆయన జయంతినే అంతర్జాతీయ కళాకారుల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

పట్నంబజారు: ఆలయంలో అమ్మవారి బంగారు కళ్లు అపహరించుకు పోయిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాత గుంటూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోకి బుధవారం తెల్లవారుజామున దుండగులు ప్రవేశించి అమ్మవారి బంగారం కళ్లు అపహరించుకు పోయారు. ఆలయ నిర్వాహకుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పాత నేరస్తుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

వాలీబాల్ పోటీల్లో నారాకోడూరు విద్యార్థి ప్రతిభ



దేవిడ్‌రాజును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. డేవిడ్‌రాజు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర విభాగంలో అక్టోబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కడపలో రాష్ట్ర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో డేవిడ్ రాజు ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. నవంబర్1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొననున్నాడు. శ్రీనగర్‌కు బయలు దేరుతున్న డేవిడ్‌రాజును హెచ్‌ఎం, స్కూల్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఏడాదికి రూ. 5 లక్షల వార్షిక వేతనంతో సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధికల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, డాక్టర్ ఇర్షాద్, శ్యామలాదేవి అభినందించారు.

నవంబరు 3న పాఠశాలల్లో సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలి టౌన్: పాఠశాలల్లో నవంబరు 3న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలో మాంటిస్సోరి స్కూల్లో బుధవారం సర్వేకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ తెనాలి మండలంలో 3,6,9 తరగతుల విద్యార్థులను పరీక్షించేందుకు 46 స్కూల్స్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. సర్వే ప్రకారం మండల స్థాయి రిపోర్టులను తయారు చేస్తారని వివరించారు. అసెస్‌మెంట్ వర్క్ ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఎంఈఓ- 2 జయంత్‌బాబు మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఈవీఎస్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉండవని, కేవలం లిటరసీ, న్యూమరసీ తరగతి స్థాయి గణితం, లాంగ్వేజ్‌లలో మాత్రమే సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్, కేంద్ర ప్రభుత్వ అన్ని రకాల పాఠశాలల్లో సర్వే ఉంటుందన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యావనరుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: పట్టణంలోని జామియా మసీదు వద్ద పేదలకు అన్నదానం చేశారు. చేబ్రోలుకు చెందిన షేక్ కరీముల్లా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అర్షద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ తెనాలి సహకారంతో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్, నాయకులు షేక్ దస్తగిరి, షబ్బీర్, బాషా, అబ్దుల్ రెహమాన్, షేక్ తాజ్ బాషా, ఆలీ, గోపి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి ఐతానగర్ హయ్యరుపేట తాడిబోయిన వారి వీధిలో పేకాటాడుతున్నారన్న సమాచారంతో టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు నేతృత్వంలో ఎస్ఐ టి.రమేష్‌బాబు, సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.52,400, సెల్‌ఫోన్లు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

నందివెలుగు రోడ్డులో రాకపోకలపై ఆంక్షలు

తెనాలిరూరల్: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర తెనాలి మండలంలో గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో నందివెలుగు మీదుగా వాహన రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి తెలిపారు. ఉదయం 11 గంటల్నుంచి తెనాలి-విజయవాడ, తెనాలి-గుంటూరు వయా నందివెలుగు వెళ్లే వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.

28న పంపాతీరం నవలపై చర్చ

తెనాలి: ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచించిన పంపాతీరం నవలపై ఈనెల 28న సాయంత్రం ఆరు గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ప్రసిద్ధ సంపాదకురాలు ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రతి నెలా ఓ పుస్తకంపై చర్చా కార్యక్రమంలో భాగంగా జరిగే చర్చలో రచయిత్రి ఓల్గాతో పాటు ప్రముఖ కవి, కవిత సంపాదకుడు బండ్ల మాధవరావు, విరసం అరసవిల్లి కృష్ణ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ పిల్లి వాసు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

బైక్ అపహరణ

తెనాలిరూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. నందులపేటకు చెందిన చైతన్యకృష్ణ గత నెలలో తన బైక్‌ను మార్కెట్ ఏరియాలోని స్నేహితుడి రూంలో పెట్టి హైదరాబాద్ వెళారు. రెండు రోజుల అనంతరం తిరిగి రాగా వాహనం లేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో చివరకు బుధవారం వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా రథోత్సవం



పాత గుంటూరు: సంపత్‌నగర్ శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని బుధవారం అమ్మవారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కళాకారుల నత్యాలు, కోలాట ప్రదర్శనతో నగరంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



మంచాల(చేబ్రోలు): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేబ్రోలు మండలం మంచాలలో బుధవారం కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కనకదుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలులోని ముట్లూరు రోడ్డులో 19వ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా భవానీ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఘనంగా గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులు కోలాహలంగా కొమ్మమూరు చానల్‌లో నిమజ్జనానికి తరలివెళ్లారు.

తొమ్మిది మందికి యాంజియోగ్రామ్

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మెడ్ స్టార్ ఆస్పత్రిలో నిర్వహణ



వైద్య చికిత్స కోసం వచ్చిన గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: గుండెపోటు రాక మునుపే, ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయించుకోగలిగితే చాలా వరకు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం గుండవరం, గొడవర్రు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన వైద్యశిబిరం ద్వారా యాంజియోగ్రామ్ పరీక్షలు అవసరమైన తొమ్మిది మందిని మొదటి విడతగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్ స్టార్ వైద్యశాలకు బుధవారం తరలించారు. వీరిలో గుండె సమస్య ఉన్న ముగ్గురికి స్టంట్ కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వేయించనున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. మానసికంగా ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకుంటే, ఆరోగ్యశ్రీ పథకం వెన్నంటి ఉండి, ఆర్థిక భరోసా ఇచ్చి ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్తులకు అంబటి మురళీకృష్ణ చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న సంక్షేమ పాలన, ప్రభుత్వంపై గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ మరింతగా పెరిగేందుకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న ఓ వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కును బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ మాట్లాడుతూ ఇటీవల చిలువూరు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే చిలువూరు శెవిరి అనారోగ్యానికి గురికావడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో పేదవాడైన శెవిరి సీఎం సహాయ నిధిని అందించాలని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డిని కోరగా, స్పందించిన ఆయన సీఎం సహాయ నిధికి సిఫార్సు చేయగా రూ.35 వేలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఆ చెక్కును శెవిరికి అందజేశామని రజనీకాంత్ చెప్పారు. నాయకులు నెమలికంటి బిచ్చురావు, సిహెచ్ ఫిలోమినీ, తురకా మోహన్‌దాస్, 5వ వార్డు సచివాలయ కన్వీనర్ మధుబాబు, షేక్ హసామ్ అహమ్మద్, సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

నూర్ బాషా సింహగర్జనను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఏపీ నూర్‌బాషా (దూదేకుల) సంఘం సింహగర్జన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘ కార్యదర్శి షేక్ ఖాజావలి అన్నారు. తాడేపల్లి నులకపేటలో బుధవారం నూర్‌బాషా (దూదేకుల) సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ గుంటూరులోని పొన్నూరు రోడ్డులో గల ముస్లిం కాలేజీలో జరిగే ఏపీ రాష్ట్ర నూర్‌బాషా (దూదేకుల) సంఘం సింహగర్జన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి షేక్ మస్తాన్, నాయకులు షేక్ బాషా, మందడం మేస్త్రి, షేక్ ఖాసిం, షేక్ నజీర్, షేక్ సైదు హుస్సేన్, జాన్ సైదా, మీరావలి, బాజీ పాల్గొన్నారు.

దుగ్గిరాల ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల ఇరిగేషన్ 'డి' కార్యాలయం వద్ద వామపక్ష నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌కు వెంటనే నిధులు కేటాయించి, రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. వర్షాలు లేకపోవడం, ప్రభుత్వం కాలువల ద్వారా సరిపడా నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, ఇంజిన్ల ద్వారా పొలాలకు నీరు పెట్టాలంటే చాలా ఖర్చు అవుతోందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం హైలెవల్ చానల్ ద్వారా పొలాలకు సరిపడా నీరు విడుదల చేయాలని కోరారు. హైలెవల్ చానల్ పోరాట కమిటీ కన్వీనర్, కో-కన్వీనర్ ఎం.శివసాంబిరెడ్డి, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులు ఎకరాకు ముందుగా రూ.20 వేలు చెల్లించి, మరో రూ.20 వేలు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో నీరు అందక పొలాలు ఎండిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అఖిలపక్ష రైతు సంఘం, హైలెవల్ చానల్ పోరాట కమిటీ నాయకులు, రైతులు, కౌలు రైతులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల భార్గవ్ భార్య బాలకోటేశ్వరి అతడితో విభేదించి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కోటేశ్వరి తల్లి రమాదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ పరిరక్షణ యూనియన్ బాధ్యత

తెనాలి: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, తెనాలి శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహించారు. సౌత్ సెంట్రల్ జోన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జి.కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల సంపదతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని కాపాడుకోవడం యూనియన్ ముఖ్యమైన బాధ్యతగా చెప్పారు. ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మచిలీపట్నం నాయకులు డాక్టర్ కళాధర్, ఎస్ఎంకే ప్రసాద్, ఠాగూర్, చంద్రపాల్ పాల్గొన్నారు.